సాక్షి ఏలూరు

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు కామినేని నాగరాజు, శేషారత్నం దంపతులు (ఉంగుటూరు మండలం వేమండ) రూ.1,25,000ను విరాళంగా అందజేశారు.



సంప్రోక్షణ

భీమవరం(ప్రకాశంచౌక్): పంచారామక్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ధైర్యలక్ష్మీ నమోస్తుతే



భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారి ఆలయ 59 వార్షిక మహోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని ధైర్యలక్ష్మిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

ఫిష్ ఆంధ్రాతో మత్స్యకారులకు మేలు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగుకు ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో డిమెస్టిక్ మార్కెటింగ్ ఫిష్ ఆంధ్రా యూనిట్లపై మత్స్యశాఖ అధికారులు, మత్స్యశాఖ అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. యూనిట్లకు సంబంధించి కొందరు అధికారులు వెనుకబడి ఉన్నారని, వీటిని అధిగమించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. యూనిట్ల అవుట్‌లెట్లకు సంబంధించి గ్రౌండింగ్, రుణాల ప్రక్రియలపై సమీక్షించారు. నాన్ ఆక్వా నుంచి ఆక్వాకు కన్వెన్షన్ చేసిన 50 వేల ఎకరాలకు సంబంధించి గ్రామాల వారీ సర్వే నంబర్లతో సహా నివేదికను అందించాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీపీఓ మల్లికార్జునరావు, మత్స్యశాఖ ఏడీలు జి.రాజేష్, బి.నర్సయ్య, ఆర్.ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి ఫార్మటివ్ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 7వ తేదీ నుంచి 3వ ఫార్మటివ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎంవీ అవధాని ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 8 తరగతుల విద్యార్థులకు క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ పరీక్షలను ఓఎంఆర్ షీట్ల ద్వారా, 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రశ్నాపత్రాల ద్వారా నిర్వహించాలని ఆదేశించారు. అన్ ఎయిడెడ్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు ఇవ్వమని, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఓఎంఆర్‌లు ఇస్తామని పేర్కొన్నారు. పరీక్షలు ఈనెల 10వ తేదీ వరకూ జరుగుతాయని తెలిపారు.

క్షీరారామంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



న్యాయమూర్తి మానవేంద్రనాథ్‌రాయ్‌ని ఆశీర్వదిస్తున్న అర్చకులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని (క్షీరారామం) శనివారం హైకోర్టు న్యాయమూర్తి సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ సందర్శించారు. ముందుగా ఆయ నకు ఆలయ అధికారులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్దనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆయనకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం న్యాయమూర్తి మానవేంద్రనాథ్‌రాయ్ అక్కడి నుంచి బయలుదేరి పట్టణంలోని మారుతి థియేటర్ వద్దకు వెళ్లి అక్కడ కొంతసేపు వేచి ఉన్నారు. తదుపరి పట్టణ కోర్టును పరిశీలించారు. అక్కడి నుంచి స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామిని దర్శించారు. జిల్లా జడ్జి పురుషోత్తంకుమార్, నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి విజయదుర్గ, నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, స్థానిక జడ్జిలు ఎన్.ఉషాలక్ష్మీకుమారి, పి.భానుసాయి, తహసీల్దార్ నాగదేవి తదితరులు ఆయన వెంట ఉన్నారు.



రాజు యాదవ్ చిత్రంలోని ఓ సన్నివేశంలో..

గెటప్.. హాస్యంలో టాప్

- సరదాగా చేసిన కామెడీ నటుడిని చేసింది
- జూనియర్ కమలహాసన్‌గా గుర్తింపు
- సినిమాల్లో రాణిస్తున్న కాళింగగూడెం యువకుడు
- విభిన్న పాత్రలతో గెటప్ శ్రీనుగా ఆకట్టుకుంటూ..

కళారంగంపై మక్కువ.. హాస్యంలో వినూత్న పంథా.. వైవిధ్య గెటప్‌లతో నటన.. అతడికి సినిమా అవకాశాలు తెచ్చిపెట్టింది.. చిన్నతనం నుంచి సరదాగా చేసిన కామెడీ నటుడిగా నిలబెట్టింది.. వలస కుటుంబంలో పుట్టి తల్లిదండ్రులతో కలిసి కూలి పనులకు వెళ్లిన యువకుడు వెండితెరపై క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్నాడు. అతడే ఆకివీడు మండలం కొల్లేరు తీర గ్రామమైన కాళింగగూడెంకు చెందిన బొడ్డుపల్లి శ్రీనివాస్ ఉరఫ్ గెటప్ శ్రీను. బుల్లితెర నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ సినీ రంగంలో అవకాశాలు దక్కించుకుంటున్నాడు.

SUNDAY SPECIAL

కూలీ కుటుంబం నుంచి వెండితెర వెలుగుల్లోకి..

ఆకివీడు : శ్రీకాకుళం నుంచి వలస కూలీలుగా కాళింగగూడెం వచ్చిన బొడ్డుపల్లి రామస్వామి, దాలమ్మ దంపతుల కుమారుడు గెటప్ శ్రీను. గ్రామంలోని పంట కాలువ పక్కన చిన్న పూరింట్లో అతడి బాల్యం గడిచింది. సిద్ధాపురం హైస్కూల్‌లో పదో తరగతి వరకు, దుంపగడప ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదివాడు. తల్లిదండ్రులతో కలిసి కూలి పనులకు వెళ్లేవాడు. చిన్నతనం నుంచి హాస్యధోరణితో ఉండే శ్రీను తోటి కూలీల మాటలను, నడకను అనుకరిస్తూ హాస్యం పండించేవాడు. తన హావభావాలతో నవ్విస్తూ అందరినీ ఆకట్టుకునేవాడు. పాఠశాలలో, కళాశాలలో, స్నేహితుల వద్ద అతడు సరదాగా చేసిన కామెడీ



కుటుంబ సభ్యులతో బొడ్డుపల్లి శ్రీనివాస్ (గెటప్ శ్రీను)

హాస్యనటుడిని చేసింది. చిన్నతనం నుంచి డ్యాన్స్‌లోనూ ప్రతిభ కనబర్చేవాడు. చిరంజీవిపై అభిమానంతో సినిమాల్లో రాణించాలని కలలుగన్నాడు.

యాంకర్ నుంచి హీరో వరకూ.. ఇంటర్‌తో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టిన గెటప్ శ్రీను యాంకర్‌గా బుల్లితెరలోకి ప్రవేశించి అనంతరం పలు కార్యక్రమాలు, టీవీ షోలు, స్టేజ్ షోల్లో రాణించాడు. తరచూ హాస్యం, విభిన్న గెటప్‌లతో ఆకట్టుకుంటూ గెటప్ శ్రీనుగా, జూనియర్ కమల్‌హాసన్‌గా పేరు తెచ్చుకున్నాడు. సినీ హాస్యనటుడు వేణు సహకారంతో తెలుగబ్బాయి చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమయ్యాడు. ఇస్మార్ట్ శంకర్, రంగస్థలం, లైగర్, గాడ్‌ఫాదర్, జాంబిరెడ్డి, పొలిమేర తదితర 70 చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించాడు. ప్రస్తుతం అతడు నటిస్తున్న భోళాశంకర్ తదితర చిత్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అలాగే రాజు యాదవ్ చిత్రంలో హీరోగా నటనతో మెప్పించాడు.



ఆకివీడులో సత్కారం అందుకుంటూ.. (ఫైల్)

బోరు కొట్టించకుండా.. గెటప్ శ్రీను కళారంగంలో రాణిస్తూ ఆర్థికంగా స్థిరపడి హైదరాబాద్‌లో సెటిల్ అయ్యాడు. అందరూ నటిస్తారని, అందుకు భిన్నంగా, మనసును హత్తుకునేలా నటించాలన్నదే తన లక్ష్యమని గెటప్ శ్రీను చెబుతున్నాడు. బుల్లితెరపై బోరు కొట్టించకుండానే వెండి తెరపై ప్రేక్షకుల్ని రంజింపజేస్తున్నానని, సినిమాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగడమే తన లక్ష్యమని అంటున్నాడు. తరచూ గెటప్ శ్రీను స్వగ్రామం కాళింగగూడెం వస్తుంటాడు. స్థానికంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. జిల్లాలో పలు కార్యక్రమాల్లో సత్కారాలు కూడా అందుకున్నాడు.

చేయూత మార్ట్‌తో మహిళా సాధికారత

చింతలపూడి: మహిళా ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో చేయూత మహిళా మార్ట్‌లను ప్రారంభిస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ అన్నారు. చింతలపూడిలో ఏర్పాటుచేసిన మహిళా మార్టును శనివారం ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 8.60 లక్షల డ్వాక్రా సంఘాల్లో 90 లక్షల మంది సభ్యులు ఉన్నారన్నారు. రూ.10 లక్షల కన్నా ఎక్కువ రుణాలు తీసుకున్న గ్రూపులు 3 లక్షల వరకు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో స్త్రీనిధి, ఎస్‌హెచ్‌జీ రుణాల తిరిగి చెల్లింపు 99 శాతం ఉండటం అభినందనీయమన్నారు. మహిళలు అన్నిరకాలుగా అభివృద్ధి చెందేందుకు సీఎం జగన్ పలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో చింతలపూడిలో రెండో చేయూత మార్ట్ ప్రారంభించామన్నారు. సుమారు 25 వేల మంది సభ్యులతో రూ.45.13 లక్షల షేర్ ధనంతో మార్ట్‌ను ఏర్పాటుచేశామన్నారు. అలాగే ఫిష్ ఆంధ్రా కింద మినీ అవుట్‌లెట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. జిల్లాలో 300 అవుట్‌లెట్లు మంజూరు కాగా ఇప్పటికే 50 మంది ముందుకు వచ్చారన్నారు. ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా మాట్లాడుతూ మహిళా మార్ట్ పై అంతస్తు నిర్మించి మరింత విస్తరించేందుకు తమ వంతు నిధులను అందజేస్తామని కలెక్టర్ సహకరించాలని కోరారు. రాష్ట్రంలో మహిళా సంక్షేమం, సాధికారతకు సీఎం జగన్ కృషిచేస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ నీరజా సుధాకర్, సెర్ప్ ఏడీ మహిత, ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సంక్షేమ సంబరం



గణపవరం: జల్లికాకినాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



కైకలూరు: కలిదిండిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)

భళా బాలోత్సవం



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రం అందుకుంటున్న బాలోత్సవం నిర్వాహకులు

నేను జపాన్ అమ్మాయిని..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్‌లో హేలాపురి బాలోత్సవం 3వ పిల్లల సంబరాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 60 రకాల సాంస్కృతిక, అకడమిక్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, కోలాటం, శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలాపన, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, క్విజ్, తెలుగులో మాట్లాడటం, కథ చెప్పడం, వక్తృత్వం, చిత్రలేఖనం వంటి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1,000 మందికి పైగా విద్యార్థులు 'పాడుదామా స్వేచ్ఛగీతం' అనే దేశభక్తి గీతాన్ని ఒకేసారి ఆలపించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. బాలోత్సవం ఆహ్వాన సంఘ నాయకులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు సర్టిఫికెట్, మెడల్‌ను అందజేశారు. బాలోత్సవానికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నగరంలో సందడి కనిపించింది.

ప్రతిభను వెలికితీసేలా.. బాలోత్సవం ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవం వంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎస్‌ఎస్ మూర్తి మాట్లాడుతూ బాల్య జ్ఞాపకాలు జీవితాంతం గుర్తుంటాయని, ఇలాంటి బాలోత్సవాలు మరెన్నో జరగాలని ఆకాంక్షించారు. డీఈఓ ఎంవీ అవధాని మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవాలని సూచించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. సీఆర్ రెడ్డి విద్యాసంస్థల పాలక మండలి కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, స్కూల్ కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపాల్ సాయికుమారి శంకర్, స్కూల్ డైరెక్టర్ రాజకళ, దీపక్ నెక్స్‌జెన్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆర్.గంగాధర్, ఆహ్వాన సంఘం ప్రధాన నాయకులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య హేల



కాంతార వేషధారణలో..

పెళ్లికి పది రోజులు ఉండగా..

ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి ఆత్మహత్య



హరీష్‌బాబు (ఫైల్)

ద్వారకాతిరుమల: ఏం కష్టం వచ్చిందో తెలియదు గానీ.. తన పెళ్లికి ఇంకా పది రోజులు మాత్రమే సమయం ఉందనగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పంగిడిగూడెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇంటి పుష్పవతి నాల్గో కుమారుడు హరీష్‌బాబు (33) ఢిల్లీలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం చేస్తున్నారు. అతడికి ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. సంక్రాంతికి ఇంటికి వచ్చిన హరీష్‌బాబు అప్పటినుంచి ఇక్కడే ఉంటూ పెళ్లి పనులు చూసుకుంటున్నారు. ఈనెల 16న వివాహం జరగాల్సి ఉండగా శనివారం పెళ్లి బట్టలు కొనేందుకు తల్లితో కలిసి ఏలూరు వెళ్లాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఉదయం అతడు ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నారు. కొద్దిసేపటికి తల్లి వచ్చి తలుపు తట్టగా హరీష్‌బాబు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగలగొట్టగా హరీష్‌బాబు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారు. కిందకు దింపి చూడగా అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ చెప్పారు.

ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓగా జేసీ

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓగా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబును నియమిస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 18న కేఆర్‌ఆర్‌సీ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.రజినికుమారిని ఐటీడీఏ పీఓగా నియమించగా ఆమె 20న బాధ్యతలు చేపట్టిన గంటలోనే ఎన్టీఆర్ జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీగా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబును ఇన్‌చార్జిగా నియమించారు.

రసవత్తరంగా ఎస్‌పీఎల్ మ్యాచ్‌లు

Regional Sponsor APMDC APMDC FOUNDATION

సాక్షి, భీమవరం: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు మూడో రోజు శనివారం రసవత్తరంగా సాగాయి. ప్రొఫెషనల్ క్రికెటర్లకు ఏ మాత్రం తీసిపోకుండా అటు బ్యాటింగ్‌తోపాటు ఇటు బౌలింగ్‌లోనూ క్రీడాకారులు మెరుస్తున్నారు. మొదటి మ్యాచ్‌లో తణుకు ఎస్‌సీఐఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాల, వీరవాసరం ఎస్‌ఎంబీటీ అండ్ ఏవీ కళాశాల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన తణుకు జట్టు 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. అనంతరం వీరవాసరం డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 82 పరుగులు మాత్రమే చేయగలిగింది. 14 పరుగుల తేడాతో తణుకు ఎస్‌సీఐఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాల జట్టు విజయం సాధించింది. 47 పరుగులతో బి.వీరవెంకటేశ్వరరావు తణుకు కళాశాల జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.



తొలి మ్యాచ్ విజేత తణుకు ఎస్‌సీఐఎం డిగ్రీ కళాశాల జట్టు, 47 పరుగులు చేసిన వెంకటేశ్వరరావు

SPL SAKSHI PREMIER LEAGUE

SAKSHI సాక్షి SAKSHI DIGITAL MEDIA GROUP


రెండో మ్యాచ్ విజేత రామచంద్ర కళాశాల

రెండో మ్యాచ్ రామచంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఏలూరు, ఏలూరు సెయింట్ విన్సెంట్ డీపాల్ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన రామచంద్ర కళాశాల జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుంది. ప్రత్యర్థిని కట్టుదిట్టమైన బౌలింగ్‌తో 32 పరుగులకే ఆలౌట్ చేసింది. అనంతరం 4.1 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి 9 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది.

మూడో మ్యాచ్‌లో సర్ సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఏలూరు, ఆదిత్య డిగ్రీ కళాశాల భీమవరం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన సీఆర్ రెడ్డి కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 129 భారీ స్కోరు సాధించింది. అనంతరం పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థి జట్టును 31 పరుగులకే కట్టడి చేసి, 98 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది.


మూడో విజేత సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల జట్టు


నాలుగో మ్యాచ్ విజేత విష్ణు కళాశాల జట్టు

నాలుగో మ్యాచ్‌లో శ్రీ విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భీమవరం, ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిడదవోలు జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన విష్ణు కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 119 స్కోరు నమోదు చేసింది. అనంతరం నిడదవోలు జట్టును 40 పరుగులకే పరిమితం చేసి విజయాన్ని అందుకుంది.

శ్రీవారిని దర్శించుకున్న సినీ దర్శకుడు బాబి


శ్రీవారి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న బాబి

ద్వారకాతిరుమల: మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమా మంచి కలెక్షన్లతో దూసుకెళ్తోందని ఆ చిత్ర దర్శకుడు కొల్లి బాబి అన్నారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని శనివారం సందర్శించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శ్రీవారి ఆలయాన్ని దర్శించడం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. వాల్తేరు వీరయ్య సినిమాకు రూ.250 కోట్ల కలెక్షన్లు వచ్చాయన్నారు. రీఎంట్రీ తరువాత చిరంజీవికి బిగెస్ట్ హిట్ చిత్రం ఇదేనన్నారు. భవిష్యత్తులో పవన్‌కల్యాణ్‌తో సినిమా చేస్తానన్నారు.

కనబడుటలేదు


యనికపల్లి నాగరాజు
6281421239, 9848182316
8919740729, 6303118547

జయశ్రీ గ్రూప్స్ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

రావులపాలెం: కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో జయశ్రీ గ్రూప్స్ ముందుచూపు అభినందనీయమని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ అన్నారు. ఊబలంక రోడ్డులో జయశ్రీ గ్రూప్స్ రాష్ట్ర కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. జయశ్రీ గ్రూప్స్ సభ్యులకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, రాజానగరం, పి.గన్నవరం, గోపాలపురం ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, కొండేటి చిట్టిబాబు, తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అభినందనలు తెలిపారు. ఈవీట్రిక్, ఐటమీ, మెగాట్రాన్ కంపెనీలతో కలసి రాష్ట్రంలో 639 షోరూములు, 3,569 చార్జింగ్ స్టేషన్లు ప్రారంభిస్తున్నామని జయశ్రీ గ్రూప్స్ నిర్వాహకులు తెలిపారు. త్వరలో రాష్ట్రంలో ప్రతి 20 కిలోమీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్ ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎండీలు మనోజ్‌పాటిల్, జి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బాస్కెట్ బాల్ పోటీలు


మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

నూజివీడు: పట్టణంలోని విక్టోరియా పురమందిరం ఆవరణలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ 66వ రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు రెండో రోజు శనివారం ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ టోర్నమెంట్‌కు 12 బాలుర జట్లు, 12 బాలికల జట్లు హాజరవ్వగా, లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలను నిర్వహిస్తున్నారు. లీగ్ పోటీలు పూర్తయి పలు జట్లు నాకౌట్ దశకు చేరుకున్నాయి. నాకౌట్ పోటీల అనంతరం సెమీఫైనల్స్, ఫైనల్స్ నిర్వహిస్తారు. బాలికల విభాగంలో గుంటూరు, కర్నూల్, కృష్ణా, చిత్తూరు, అనంతపురం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జట్లు నాకౌట్ దశకు చేరుకున్నాయి. బాలుర విభాగంలో కర్నూలు, విశాఖపట్టణం, చిత్తూరు, గుంటూరు చేరాయి. పోటీల సందర్భంగా టోర్నమెంట్ అబ్జర్వర్ కె.కృష్ణారెడ్డిని, భాగ్యలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ వాకా నాగరాజు పర్యవేక్షణలో పోటీలను నిర్వహిస్తున్నారు.

ఇరు వర్గాలపై కేసులు.. 11 మంది అరెస్టు

టి.నర్సాపురం: పొలం తగాదాలో గొడవపడిన ఇరువర్గాలకు చెందిన 11 మంది గిరిజనులను శనివారం అరెస్ట్ చేసి చింతలపూడి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ చెప్పారు. గట్టుగూడెంలో గత ఏడాది నవంబర్ 23న పొలం వివాదంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో రెండు వర్గాలకు చెందిన 20 మంది గిరిజనులకు గాయాలయ్యాయి. రెండువర్గాల ఫిర్యాదులపై అప్పట్లో కేసులు నమోదు చేశారు. ఆయా కేసుల్లో ఇరువర్గాలకు చెందిన 11 మందిని అరెస్టు చేయగా మిగిలిన వారిని అరెస్టు చేయాల్సి ఉంది. ఈ కేసుల్లో ఒకవర్గానికి చెందిన రవ్వ మోహన్‌రావు, రవ్వ దుర్గారావు, పూన్నెం శివ, తొట్టి నరసింహారావు, తొట్టి వెంకన్నబాబు, సోయం అర్జున్‌రావులను, మరోవర్గంలోని పూణెం నాగేశ్వరరావు, పూణెం వీరాస్వామి, పూణెం కన్నారావు, పూణెం అప్పారావు, పూణెం వెంకటేశ్వరరావులను అరెస్ట్ చేసి కోర్టుకు పంపినట్లు వివరించారు.

కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు తీవ్ర అన్యాయం

ఏలూరు (టూటౌన్): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేతకు తీవ్ర అన్యాయం జరిగిందని చేనేత కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. దేశంలో 77 లక్షల మందికి జీవనాధారంగా ఉన్న చేనేత పరిశ్రమకు 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.200 కోట్లు కేటాయించడం సరికాదన్నారు. గతంలో జాతీయ చేనేత బోర్డు ద్వారా పరిశ్రమ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి నిధులు ఖర్చు పెట్టేవారని, ఇప్పుడు జాతీయ చేనేత బోర్డును రద్దు చేయడం దారుణమన్నారు. చేనేత సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు.